క్లుప్తంగా

మండల తహసీల్దార్‌గా మల్లారెడ్డి

నర్వ: మండల తహసీల్దార్‌గా మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ రాజగణేష్ పదోన్నతిపై సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో వచ్చిన తహసీల్దార్ మల్లారెడ్డి నల్గొండ జిల్లా నుంచి నర్వకు బదిలీపై వచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు.

క్రీడాకారులకు కిట్ల పంపిణీ



మాగనూర్: గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని అమ్మపల్లి సర్పంచ్ పద్మమ్మ అన్నారు. మంగళవారం ఆమె స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామంలోని యువతకు క్రీడాకిట్లను పంపిణీచేశారు. ఆమె మాట్లాడుతూ.. క్రీడా ప్రాంగణాల్లో ప్రభుత్వం అందిస్తున్న కిట్లతో ఆటల్లో ముందుండాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదివించడమే కాక క్రీడలలో కూడా రాణించడానికి శ్రద్ధచూపాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

యువకుడికి సన్మానం



ధన్వాడ: ప్రభుత్వం విడుదలచేసిన పోలీస్‌కానిస్టేబుల్ ఫలితాలలో మండలంలోని మందిపల్లికి చెందిన బోడి పవన్‌కుమార్ ఎంపిక కావడంతో మంగళవారం సింగిల్‌విండో సీఈఓ వెంకట్రాములు, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు.

బోర్డు ఇలా.. దారి తెలిసేది ఎలా?



మాగనూర్: మండలంలోని గురువలింగంపల్లి, తళంకేరి గ్రామాలకు వెళ్లు దారిలో ఏర్పాటుచేసిన సూచికబోర్డు నిరుపయోగకరంగా పడి ఉంది. అయితే ఈ దారిలో కొత్తగా వచ్చేవారికి గ్రామ సూచికబోర్డు లేకపోవడంతో మేటువెళ్లాలో అర్థం గాక మరోదారిలో ఉన్న కొత్తపల్లి గ్రామానికి డైరెక్ట్ వెళ్లిపోతున్నారు. దీంతో సమయం వృథా కావడంతోపాటు పనులు కూడా ఆలస్యమవుతున్నాయని వాపోతున్నారు. బోర్డులు ఏర్పాటుచేసి కొంతకాలమైన అప్పుడే ఇలా కావడంపై సర్వత్రవిమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే కొన్నిచోట్ల సూచిక బోర్డులు కూడా పడిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ట్యాంకర్ ఢీకొని ఐదు మేకలు మృతి

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో రోడ్డుపై వెళ్తున్న మేకలను అకస్మాత్తుగా ట్యాంకర్ ఢీకొనడంతో ఐదు మేకలు మృతిచెందాయి. కర్ణాటకలోని శక్తినగర్ నుంచి సేడం తదితర పట్టణాలకు యాస్ బూడిదను తీసుకెళ్తున్న ట్యాంకర్ల డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం మూలంగా ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ట్యాంకర్ డ్రైవర్‌పై చర్యలు తీసుకుని నష్టపరిహారం ఇప్పించాలని మేకల యజమాని మహదేవ్ కోరారు.

వృథాగా పోతున్న తాగునీరు

మాగనూర్: తాగునీరు వృథా చేయొద్దని ప్రభుత్వాలు ప్రచారాలు మేరకు తప్ప ఆచరణలో కానరావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని వడ్వాట్ ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన తాగునీటి కొళాయి మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కొళాయికి మరమ్మతు పనులు చేపట్టి వృథా నీటిని అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

● ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి



రాంకిష్టాయిపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: బీఆర్‌ఎస్ తెలంగాణను రాష్ట్రాంలో దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో మొదటిస్థానంలో నిలిపిందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మనిపూర్ తండా, రాంకిష్టాయిపల్లి, కిష్టాపూర్, మడిగెలముళ్ల తండా, గోటూర్, కొండ్రోన్‌పల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఇంటింటికీ పథకాలు చేరాయని కుల మతాలకు అతీతంగా ప్రభుత్వం అందరి అభివృద్ధి కోసం వివిధ పథకాలను తీసుకొచ్చిందన్నారు. రైతులకు రుణమాఫీ, కల్యాణలక్ష్మి, షాదిముభారక్, బీసీ బంధు, రైతుబంధు, దళితబంధు, గృహలక్ష్మి ఇలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలు దేశంలో ఎక్కడ తీసుకురాలేదన్నారు. వచ్చే ఎన్నికలో బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విమల, జిల్లా కోఆప్షన్ సభ్యులు వాహీద్, ఎంపీటీసీ కడుపయ్య, సుధీర్‌కుమార్‌రావు, సర్పంచ్ మాదవ రెడ్డి, నారాయణరెడ్డి, హన్యానాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యువజన సంఘం అధ్యక్షుడు సునిల్‌కుమార్, మురళీధర్‌రెడ్డి, బాల్‌రాజు, భగవంత్‌రెడ్డి, నాగిరెడ్డి, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటువేయాలని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపట్నం, పల్లెగడ్డ, మాద్వార్ గ్రామాల్లో మంగళవారం పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ హామీలకు మోసపావద్దని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, సర్పంచ్‌లు సుజాత, ఆంజనేయులు, పూణ్యశీల, రవి, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, రామాస్వామి, బసంత్, రాజవర్ధన్‌రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ ఆశయాలను కొనసాగిస్తాం



నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నారాయణపేట రూరల్: యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ ఆశయాలను కొనసాగిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజి అన్నారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల అభ్యున్నతికి, విద్యారంగ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారని, సంఘం బలోపేతంలో ఆయన కృషి వెలకట్టలేనిదన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో భీమయ్య, గోవింద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ



నర్సింహాగౌడ్‌ను సన్మానిస్తున్న స్వామిజీ

మాగనూర్: మక్తల్ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పి నర్సింహాగౌడ్ తల్లి లక్ష్మమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం మండలంలోని నేరడగంలో సిద్దలింగేశ్వర స్వామిజీ మఠం ఆవరణలో విద్యార్థులకు పండ్లుపంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను స్మరించుకుంటే ఆ భగవంతుడి స్మరించుకున్నట్లేనని తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బందితో కలిసి స్వామిజీ ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, చెన్నయ్‌గౌడ్, బాలరాజు, పాఠశాల సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

కోస్గి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అమలు చేస్తామని ప్రకటించిన ఆరు గ్యారెంటీల కరపత్రాలతో మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి చంద్రవంచలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతూ కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని ముశ్రీఫా, ముంగిమళ్ల, ముక్తిపాడ్ గ్రామాల్లో సైతం పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇందులో ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మరికల్: మండలంలోని ఎలిగండ్లలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం పీడీ వేణుగోపాల్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి అధిక సంఖ్యలో పిల్లలు వచ్చేలా టీచర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే చిన్నారులకు, గర్భిణి, బాలింతలకు అందజేస్తున్న పౌష్టకాహారం సక్రమంగా అందజేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మక్తల్: 15, 16, 17 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగే డీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర, అధ్యక్షురాలు హైమావతి కోరారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగరాజు, బాలప్ప, సూర్యప్రకాష్, గోపాల్, చంద్రశేఖర్, పృదీరాజ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి



పెబ్బేరు రూరల్: ఇటీవల వెలువడిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన యువకులు మల్లేష్, వెంకటేష్ యాదవ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. మంగళవారం గ్రామంలో వారిని సర్పంచ్ కొండన్న గ్రామస్తులతో కలిసి సన్మానించారు.

గ్రామాల్లో మేరాదేశ్.. మేరామట్టి



గ్రామంలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లి గ్రామంలో మండల బీజేపీ ఆధ్వర్యంలో మేరాదేశ్ ..మేరామట్టి కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక బీజేపి నాయకులు నిర్వహించారు. గ్రామంలో తిరుగుతూ గ్రామస్తులతోమట్టి బియ్యం సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రాజదాని ఢిల్లీలో అమరులైనా సైనికుల అమరవీరుల స్థూపం నిర్మాణం కోసం మట్టిని సేకరిస్తూన్నామని వారికి వివరించారు. మండల బీజేపి అధ్యక్షులు భగవంతుయాదవ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉష్ణతాపం.. పిల్ల కాల్వల్లో ఈత సరదా



అమరచింత: వానకాలం తర్వాత చలికాలం వస్తే చలితో వణికిపోతుంటాం. కానీ వర్షాకాలంలో వాతావరణం అనుకూలించని కారణంగా వర్షాలు సక్రమంగా కురవలేదు. దీంతో భానుడి తన ప్రతాపం చూపుతుండడంతో వాతావరణం వేడెక్కుతున్నది. చిన్నారులు ఉష్ణతాపానికి ఉపసమనం కోసం పిల్ల కాల్వలలో ఈత పడుతూ శరీరాన్ని చల్లబర్చుకుంటున్నారు. ప్రస్తుతం పాఠశాలలో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో తరగతుల వారీగా ఉండటంతో పట్టణానికి చెందిన చిన్నారులు ఎత్తిపోథల పిల్ల కాల్వలో పారే నీటిలో ఈత పడుతూ సరదాగా కేరింతలు కొడుతున్న దృశ్యం 'సాక్షి'కి చిక్కింది.

గ్రామ కమిటీ ఎన్నిక

పెబ్బేరు రూరల్: పేద ప్రజల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి సాధించుటకై పోరాడుతామని జనసేన పార్టీ వనపర్తి కోర్డినేటర్ ముకుందనాయుడు అన్నారు. మంగళవారం ఆయన జన సైనికులతో కలసి మండలంలోని పాతపల్లి గ్రామంలో పర్యటిస్తూ ప్రజల స్థితి గతులను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జనసేన గ్రామ కమిటిని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కావలి ఉసేన్, ఉపాధ్యక్షులు చిరంజీవి, ఎండి మహబుబ్‌అలి, ప్రధాన కార్యదర్శి శివనాయుడు, మరియు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఆర్ విష్ణు , దస్తగిరి, బన్నీ, చంటి, చిన్న, ఊశన్న, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుకకు రక్షణ కరువు

అమరచింత: తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డంప్ చేసిన ఇసుకను అక్రమంగా ఎద్దుల బండిపై తరలిస్తున్నా అరికట్టలేని స్థితిలో అధికారులు తయారయ్యారు. అమరచింతకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసి ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో డంప్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం మద్దూర్ గ్రామానికి చెందిన వ్యక్తులు ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా వాటిని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డంప్ చేశారు. వీటిని చలాన్ కట్టి తీసుకెళ్లాల్సి ఉండగా.. కేసు నమోదు అయిన వ్యక్తులే ఎడ్లబండ్లు తీసుకొచ్చి ఇసుకను తీసుకెళ్లారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యం ముఖ్యమే..



ప్రపంచ మానసిక దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ కళాశాలలో మంగళవారం మెడికోలు మానసిక సమస్యను ఎలా తగ్గించుకోవాలనే అంశంపై ప్రదర్శనలు నిర్వహించారు. చేతబడులు, మూఢనమ్మకాలపై నాటకాలు ఫ్లాష్‌మాబ్ నృత్యాలతో అవగాహన కల్పించారు. ఎస్‌వీఎస్‌లో ఆస్పత్రిలో అన్ని రకాల మానసిక సమస్యలకు చికిత్స అందిస్తున్నట్లు హెచ్ఓడీ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రతి మనిషి శారీరక ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ వహిస్తారో.. మానసిక ఆరోగ్యంపై అదేస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ జోషి, రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, జయంతి, వైద్యులు ప్రతీక్‌రెడ్డి, అఖిల, రాహుల్, భార్గవ్‌స్వరాజ్ పాల్గొన్నారు.

– పాలమూరు

లయన్స్‌క్లబ్ సేవలు విస్తృతం చేద్దాం



కొల్లంపల్లిలో హెల్త్‌క్యాంప్ ప్రారంభిస్తున్న బట్టడ్

నారాయణపేట రూరల్: పట్టణాలతోపాటు పల్లెలకు లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేద్దామని లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయన్‌బట్టడ్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొల్లంపల్లిలో హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదల సౌకర్యార్థం ఇలాంటి ఆరోగ్య సంబంధ కార్యక్రమాలు తరుచూ చేపట్టాలని, ప్రతి పల్లెకు లయన్స్‌క్లబ్ చేరుకోవాలన్నారు. అనంతరం 672మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవికుమార్‌గౌడ్, కన్న జగదీష్, మహేష్, నారాయణగౌడ్, లింగం, రాముసింగ్, జాఫర్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా ఖాతాలపై అవగాహన



తపాలా బీమా ఖాతాను ప్రారంభిస్తున్న అధికారులు

మద్దూరు: తపాలా శాఖ వారోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి మండలంలోని నిడ్జింతలో పోస్టాఫీస్ ఖాతాలపై సబ్ డివిజన్ ఐపీఓ రవికుమార్ అవగహన కల్పించారు. అలాగే పోస్టాఫీస్‌లో బీమా పథకాలు వాటి వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. గ్రామంలోని 73మందిచే తపాలాబీమాలను తెరిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ కాంతరెడ్డి, మేల్ ఓవర్సీస్ ఉమాకాంత్, బీపీఎంలు కమలోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మండల సాధన దీక్షలు విరమణ



కోటకొండలో నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో తాత్కాలికంగ మండల సాధన దీక్షలను విరమిస్తున్నట్లు సాధనసమితి నాయకులు ప్రకటించారు. కోటకొండ మండలసాధన దీక్షలు 154వ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం జరిగిన రిలే నిరసన దీక్షలకు జేఏసీ నాయకులు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చొరువ తీసుకుంటే తప్పకుండా నియోజకవర్గంలో మూడు కొత్త మండలాలు ఏర్పడేవని అన్నారు. కోటకొండను మండలంగా ప్రకటించాలని కోరినా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యహరిస్తుందన్నారు. ఎన్నికలు ముగిసే వరకు తాత్కాలికంగా నిరసన దీక్షలకు బ్రేక్ ప్రకటిస్తున్నామని, బుధవారం దీక్షా శిబిరంలో ఉపసంహరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.రాము, కెంచె శ్రీనివాసులు, చెన్నప్ప, యాదగిరి, రాములు, నర్సింహులు, రవి, నారాయణ పాల్గొన్నారు.

ఊకచెట్టువాగులో చేపపిల్లల విడుదల



చెరువులో చేపపిల్లలను వదులుతున్న మత్స్యకారులు

ఆత్మకూర్: పట్టణ శివారులోని రామన్‌పాడ్ ఊకచెట్టు వాగులో మంగళవారం మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను వదిలారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 3.35 లక్షల సబ్సిడీ చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. మత్స్యశాఖ అధికారులు వీరేష్, భరత్, సంఘం సభ్యులు ధర్మయ్య, వాకిటి లక్ష్మణ్, ఆనంద్, రవి, బాలస్వామి, లక్ష్మీనారాయణ, రాములు, శేఖర్, శివ, శ్రీను, మత్స్యకారులు పాల్గొన్నారు.

బ్యానర్‌పై సంతకాల సేకరణ



పెబ్బేరు రూరల్: తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో బ్యానర్‌పై సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలైన దళిత, గిరిజన మహిళలు, ఇతర పేదలపై దాడులు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాలని, రాజ్యాంగ హక్కులను అమలు చేలని కోరుతూ రాష్ట్రపతి అందించడానికి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. సంతకాల సేకరణలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మదన్, గంధం చిన్నగట్టయ్య, నారాయణ, శ్రీనివాసులు, గట్టయ్య, శేషన్న, జయ్యమ్మ, గంధం రాజు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో నిఘా పటిష్టం



నాగల్‌కడ్మూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు



వాహనాలను తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ

అమరచింత: ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున జిల్లా సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిఘాను పటిష్టం చేస్తున్నామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో చెక్‌పోస్టును మంగళవారం ఏర్పాటు చేశామన్నారు. నారాయణపేట జిల్లాతో సరిహద్దు ఉండటంతో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహన తనిఖీలతో పాటు మద్యం రవాణాను అడ్డుకోనేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడిచారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో రెండు రోజులుగా కొత్తకోట మీదుగా నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనాలను, హైదరాబాద్ వైపు నుంచి కొత్తకోటకు వచ్చిపోయే వాహనాలను ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తన సిబ్బందితో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వాహనాల్లో డబ్బు లు, మద్యం తరలించొద్దని, రూ.50వేల కంటే ఎక్కు వ డబ్బులు తరలిస్తే ఆధారాలు చూపించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.